AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
2-6-2026 (Tuesday) MAIN EDITION

## ఐపీవోకు గ్రీన్ టెక్నాలజీ కంపెనీ..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఈ కంపెనీ 2005లో ఆగస్టులో గ్రాండ్ మెటల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో స్థాపించారు. ఇది స్క్రాప్ లోహాన్ని అధిక నాణ్యత గల పారిశ్రామిక ముడి పదార్థాలుగా మారుస్తూ భారతదేశ రీసైక్లింగ్ పరిశ్రమలో కీలకంగా ఎదిగింది. ప్రైమరీ మార్కెట్ నుంచి రూ. 631 కోట్లు సమీకరించాలన్న లక్ష్యంతో సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. వాటాదారులు రూ. 2 ముఖవిలువ కలిగిన 3,28,58,323 షేర్లను విక్రయించడం ద్వారా ఈ నిధులను సమీకరించుకుంటారు.

## మార్కెట్‌లోకి కొత్త బజాజ్ అవెంజర్..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** బజాజ్ అవెంజర్ స్ట్రీట్ 220ని దేశీయ మార్కెట్‌లో విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.1.30 లక్షలు. బజాజ్ అవెంజర్ 220 స్ట్రీట్ బైక్‌ను స్టైలిష్ లుక్, సౌకర్యవంతమైన రైడింగ్ పొజిషన్, శక్తిమంతమైన ఇంజన్‌తో క్రూయిజర్ బైక్ ప్రియులను ఆకట్టుకునేలా రూపొందించారు. ఎత్తైన హ్యాండిల్ బార్ , ముందుకు చాపిన ఫుట్ పెగ్స్, తక్కువ సీట్ ఎత్తు, రిలాక్స్‌డ్‌గా కూర్చోవడానికి వీలుగా ఉండే రైడింగ్ పొజిషన్ కారణంగా ఈ బైక్‌లు లాంగ్ రైడ్స్‌కు అనుకూలం.

## హైకోర్టులో జనసేన సభకు షాక్..



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: హైదరాబాద్‌లో నగరంలో సభ నిర్వహణకు పోలీసులు అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. దీనిపై జనసేన హైకోర్టును ఆశ్రయించింది. హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా.. హైకోర్టు తిరస్కరించింది. దీంతో జనసేన సభ జరిగే అవకాశం లేదు. కాగా.. నేడు సాయంత్రం ప్రెస్‌మీట్ పెడతానని పవన్‌కల్యాణ్ ట్విట్టర్ పోస్ట్ చేశారు.

## బీరూట్‌పై దాడి చేయొద్దని చెప్పా: ట్రంప్



అక్షరటుడే, నేషనల్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన చేశారు. "నేను ఇజ్రాయిల్ ప్రధానితో బీబీ నెతన్యాహుతో మాట్లాడాను. లెబనాన్ లోని బీరూట్‌పై పెద్ద దాడికి వెళ్లవద్దని కోరాను. ఆయన తన దళాలను వెనక్కి మళ్లించారు. నేను హిజ్బుల్లా నాయకుల ప్రతినిధులతో కూడా మాట్లాడాను, వారు ఇజ్రా యిల్, వారి సైనికులపై కాల్పులు ఆపడానికి అంగీకరించారి పేర్కొన్నారు.

## బీజేపీకి అన్నామలై రాజీనామా



అక్షరటుడే, ఢిల్లీ: తమిళనాడు రాజకీయాల్లో సంచలన మార్పు చోటుచేసుకుంది. తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై పార్టీకి రాజీనామా చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను ఢిల్లీలో కలిసి రాజీనామా లేఖను సమర్పించారు. కాగా.. ఆయన సాయంత్రం అమిత్ షాతో కీలక భేటీ నిర్వహించారు.



## బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బండి సంజయ్ ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఏంటో మనకు తెలుసన్నారు. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్థిక పరిస్థితి ఏవిధంగా దిగజారిందో ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను దోచుకున్నారని బండి సంజయ్ ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ సంపద మాత్రమే పెరిగిందన్నారు. లక్షల కోట్ల ఆస్తులు సంపాదించారన్నారు. బీజేపీతోనే తెలంగాణ ఏర్పడిందని పేర్కొన్నారు.

**సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. సీఎం రేవంత్‌రెడ్డి అమర వీరులకు నివాళులు అర్పించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. తాము పాలకులం కాదని, ప్రజల సేవకులం అని చెప్పారు. రాచరిక ఆలోచనలు, నియంతృత్వ పోకడలను ఓడించి కొత్త చరిత్రను రాసుకోవడం కోసం ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించారన్నారు. ఈ రోజు ప్రజల మనోభావాలకు తాము ప్రతినిధులమని, సమాజ ఆకాంక్షలకు వారధులమని తెలిపారు. ప్రజలకు సేవకులుగా బాధ్యత నిర్వర్తిస్తున్నాట్లు పేర్కొన్నారు.**

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# పాలకులం కాదు.. సేవకులం..

- గ్లోబల్ గేట్‌వేగా తెలంగాణ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

ప్రభుత్వం అంటే నలుగురు చేతుల్లో పెత్తనం కాదని, నాలుగు కోట్ల ప్రజల ఉమ్మడి ప్రతినిధి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇది కేవలం పరిపాలన చేసే ప్రభుత్వం కాదు.. ప్రజాస్వామ్య ఆకాంక్షలను నెరవేర్చే ప్రజా ప్రభుత్వం అని గర్వంగా చెబుతున్నాం. తెలంగాణను భారత్‌కే కాదు గ్లోబల్ గేట్‌వేగా మార్చడమే తమ లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం విజన్ డాక్యుమెంట్ 2047 తీసుకొచ్చినట్లు తెలిపారు. 2034 వరకు తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 వరకు మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

### విద్యాశాఖలో మార్పులు

"పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది" అన్న కాళోజీ మాటల స్ఫూర్తి అని తెలిపారు. ప్రతి క్షణం తెలంగాణ ప్రజల హితమే పరమార్థంగా భావించి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని సీఎం తెలిపారు. కేంద్రం ఇచ్చిన పెర్ఫామెన్స్ గ్రేడింగ్‌లో తెలంగాణ ముందు వరుసలో నిలిచిందని చెప్పారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచే విధంగా చర్యలు చేపట్టామని వెల్లడించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని, స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేశామన్నారు.

### పేదలకు సన్న బియ్యం

పేదలకు ఆహార భద్రత కల్పించే విధంగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని రేవంత్‌రెడ్డి వివరించారు. తమ ప్రభుత్వం వచ్చాక రూ 3 కోట్ల 38 వేలమందికి సన్నబియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అందరికి సమాన అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

### అన్ని రకాల పంటలు పండించాలి

రాష్ట్రంలో 2.36 కోట్ల టన్నుల పంట దిగుబడులు రావడం గర్వకారణం అని సీఎం అన్నారు. రైతులు కొన్ని పంటలకే పరిమితం కాకుండా, అన్ని రకాల కూరగాయలు పండించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో దేశంలో ఏ రాష్ట్రం కూడా మనతో పోటీపడే పరిస్థితి లేదన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా రైతుల నుంచి చివరి గింజ వరకు కొంటామన్నారు. అగ్రికల్చరల్ ఏకో సిస్టమ్ అభివృద్ధి చేసి, రైతులను శ్రీమంతులుగా చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో జొన్న, మొక్కజొన్న పంటల సాగు ఈ ఏడాది భారీగా పెరిగిందన్నారు. యాసంగిలో సుమారు 16 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 4 లక్షల ఎకరాల్లో జొన్న సాగు చేసి తెలంగాణ రైతులు కొత్త చరిత్ర సృష్టించారన్నారు.

### త్వరలో నోటిఫికేషన్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనేక ఉద్యోగాలను భర్తీ చేశామని సీఎం పేర్కొన్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియలో పారదర్శకతను పునరుద్ధరించినట్లు చెప్పారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4తో పాటు మెగా డీఎస్సీ, వైద్యారోగ్య శాఖలో వరుసగా నియామకాలను చేపట్టామని వెల్లడించారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజనీరింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అటవీశాఖ, టౌన్ అండ్ కంట్రీప్లానింగ్, విద్యాశాఖలలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తామన్నారు.

## కాంగ్రెస్ అడ్డదారిలో అధికారంలోకి వచ్చింది..: కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్:** కాంగ్రెస్ అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 2014, 2018లో ఒంటరిగా పోటీచేసి తాము గెలిచామన్నారు. 2023లోనూ ఒంటరిగా పోటీచేసి చిన్న తేడాతో ఓడిపోయామని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ జెండా ఆవిష్కరించారు. అంతకుముందు పార్టీ కార్యాలయ ఆవరణలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2028లో మళ్లీ కేసీఆరే సీఎం అవుతారన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ తెలంగాణను మళ్లీ 25 ఏళ్లు వెనక్కి నెట్టే పరిస్థితి తెచ్చిందని విమర్శించారు. గ్యారెంటీలతో గద్దెనెక్కి వడ్డించిన విస్తరి లాంటి రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమంలో ఉన్న తెలంగాణ కాంగ్రెస్ పాలనలో సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు.

## రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే మళ్లీ అధికారంలోకి వస్తాం: పీసీసీ చీఫ్



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలో ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. ఎందరో త్యాగధనుల సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే తెలంగాణ సిద్ధించిందని స్మరించుకున్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ దృఢ సంకల్పం వల్లే ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని, పేదల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



## అమెరికాలో 30 మంది భారతీయ ట్రక్ డ్రైవర్ల అరెస్టు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలో అక్రమంగా నివాసం ఉంటున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అక్కడ ట్రక్ డ్రైవర్లుగా పనిచేస్తున్న 30 మంది భారతీయులను అరెస్ట్ చేశారు. సోమవారం యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం.. మే 11-15 తేదీల మధ్య అరిజోనాలోని యూమా సెక్టార్ ఏజెంట్లు అరెస్టు చేసిన 52 మందిలో ఈ భారతీయులు కూడా ఉన్నారు. వీరందరినీ దేశ బహిష్కరణకు సిద్ధం చేస్తున్నారు. మొత్తం 52 మందిని అరెస్టు చేయగా, వారిలో 36 మంది సెమీ ట్రక్కులు నడిపారు. వీరిలో 30 మంది భారతీయులు కాగా, ముగ్గురి వద్ద డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం గమనార్హం.

## ఆఫ్రికాకు భారత్ భారీ సాయం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఆఫ్రికా ఖండంలో వేగంగా విస్తరిస్తున్న ఎబోలా మహమ్మారిని అరికట్టేందుకు భారతదేశం మరోసారి తన ఉదారతను చాటుకుంది. అక్కడ ప్రజారోగ్య సంరక్షణ , వైద్య సామర్థ్యాలను బలోపేతం చేసే లక్ష్యంతో.. 43 టన్నుల బరువైన వైద్య సహాయ సామాగ్రి రెండవ విడతను ఆఫ్రికా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రానికి పంపింది. ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ 'ఎక్స్' వేదికగా ధృవీకరించారు. ఈ సహాయంలో అత్యవసర మందులు, సప్లిమెంట్లతో పాటు ప్రాణాంతక వైరస్ నుండి రక్షణ కల్పించే పిపిఇ కిట్లు, వ్యాధి నిర్ధారణ (డయాగ్నస్టిక్) , పర్యవేక్షణ పరికరాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సరుకు ఆఫ్రికన్ యూనియన్ పరిధిలోని ప్రజల ఆరోగ్య భద్రతకు, ఎబోలా నియంత్రణ చర్యలకు ఎంతో దోహదపడుతుందని జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## 'పెద్ది' ఈవెంట్‌లో ఫ్యాన్స్ కళ్లన్నీ జాన్వీపైనే..

**మెగా పవర్‌స్టార్ రాంచరణ్ నటించిన పెద్ది ప్రమోషన్ కార్యక్రమం విజయవాడ ఈవెంట్ బంపర్ హిట్ అయ్యింది. ఈ భారీ ఈవెంట్‌లో చిత్ర కథానాయిక జాన్వీ కపూర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యంగా వేడుకలో అందరి కళ్లూ ఈ బ్యూటీ కట్టుకున్న చీరపైనే పడ్డాయి. ఆ చీర ఖరీదు ఎంత? ఆ స్పెషల్ డిజైనర్ చీరను ఎవరు డిజైన్ చేసి ఉంటారు? అని సోషల్ మీడియాలో నెటిజన్లు ఆరా తీస్తున్నారు. జాన్వీ ఈ ఈవెంట్ కోసం ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా కలెక్షన్ నుంచి ఎంచుకున్న ఒక లగ్జరియస్ చాక్లెట్ బ్రౌన్ కలర్ శారీని ధరించారు. ఈ చీరను షీర్ నెట్.. జార్జెట్ ఫ్యాబ్రిక్‌తో ఎంతో అద్భుతంగా రూపొందించారు. చీర బోర్డర్ అంతటా కొన్ని ప్రదేశాలలో సాంప్రదాయ మోటిఫ్స్‌తో కూడిన హెవీ ఎంబ్రాయిడరీ.. సీక్విన్స్ (మెరిసే పూసలు) - జరి వర్క్ తో చాలా రిచ్‌గా డిజైన్ చేసారు. అలాగే చీర బాడీ అంతటా చిన్న చిన్న సీక్విన్ ఛమ్కీలు మెరుస్తూ మోడ్రన్ స్టైల్ గ్లామర్‌ను అద్దాయి.**

—అక్షరటుడే, సినిమాడెస్క్



## అమెరికాలో కాల్పులు.. ఏడుగురి మృతి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి కాల్పులు చోటు చేసుకున్నాయి. అయోవా రాష్ట్రంలోని మస్కటైన్‌లో సోమవారం (స్థానిక కాలమానం ప్రకారం) పలుచోట్ల జరిగిన వరుస కాల్పుల ఘటనల్లో అనుమానితుడితో సహా ఏడుగురు మరణించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల ప్రకారం.. ఈ కాల్పులు 'కుటుంబ సంబంధిత వివాదం' కారణంగా జరిగినట్లు తెలుస్తోంది. బాధితులందరూ మరణించిన అనుమానితుడి కుటుంబ సభ్యులేనని భావిస్తున్నారు. మస్కటైన్ పోలీసులు అనుమానితుడిని 52 ఏళ్ల ర్యాన్ విల్లిస్ మెక్‌ఫార్లాండ్‌గా గుర్తించారు. అతను తనను తాను కాల్చుకోవడం వల్ల గాయపడి మరణించాడని తెలిపారు.

## దేశానికే ఆదర్శంగా తెలంగాణ: పొంగులేటి



**అక్షరటుడే, వరంగల్:** అమరవీరుల మహోన్నత త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తూ అభివృద్ధిలో దూసుకుపోతోందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హన్మకొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, అత్యంత వైభవంగా ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు ప్రతి పౌరుడిలో ఆత్మగౌరవాన్ని, సామాజిక బాధ్యతను పెంపొందించేలా నిలవాలని ఆకాంక్షించారు.